క్లుప్తంగా

నేడు ఉచిత ఆయుర్వేద శిబిరం



ఆయుర్వేద శిబిరం ఏర్పాటుపై చర్చిస్తున్న హెచ్‌ఎం ఆదిలక్ష్మి

పలమనేరు: పట్టణ సమీపంలోని కిండర్ కేర్ స్పెషల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం పదేళ్ల లోపు బుద్ధిమాంద్యం చిన్నారులు, అంగవైకల్యం పిల్లలకు ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించనున్నట్టు పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక సెంటర్‌లో ఆమె మాట్లాడుతూ, కేరళకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని, అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉపాధిపై యువతకు అవగాహన

రామకుప్పం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీడీయూ–జీకేవై(సీడాప్) నైపుణ్య శిక్షణ మరియు ఉపాధి కార్యక్రమాలపై స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం లావణ్య తెలిపారు. 18 నుంచి 26 ఏళ్లలోపు గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతతో పాటు వారి తల్లిదండ్రులు ముఖాముఖి సమావేశాలకు రావచ్చునన్నారు. ఇతర వివరాలకు 9390504632 నంబరును సంప్రదించాలన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గుడుపల్లె: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని ఎంపీడీఓ రమణ అన్నారు. గురువారం మండలంలోని గుడిచెంబగిరి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇళ్ల పక్కన చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండడాన్ని పరిశీలించారు. మురుగు పేరుకుపోతే దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచ్ వెంకటేష్ మురుగును శుభ్రం చేయించారు. అనంతరం కొడతనపల్లె గ్రామ సచివాలయంలో పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద రంగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు చందూల్ రెడ్డి రసాయన రహిత, గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై పలువురు రైతులకు తన అనుభవాలను వివరించారు. ప్రకృతి సేద్యంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకుని అధిక ఆదాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు. రోహిణి కార్తె నుంచి ఆరుద్ర దాకా ఈ ప్రాంతంలో ఎలాంటి దేశవాళీ వరి వంగడాలను సాగుచేయాలో తెలియజేశారు.

కల్యాణ వైభోగమే..!



కల్యాణ మహోత్సవంలో ఉత్సవమూర్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో 18 రోజుల మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. ద్రౌపదీ ధర్మరాజుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా, పెళ్లి పెద్దలుగా సుబ్రమణ్యం, లలిత దంపతులు వ్యవహరించారు. సంప్రదాయబద్ధంగా పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భాగవతారిణి నాగరత్న అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించిన హరికథాగానం చేశారు. హాజరైన మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

శుద్ధి నీటి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



చిత్తూరు అర్బన్: నగరంలో మూడు చోట్ల శుద్ధి నీటి ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి స్థలాలను మేయర్ అముద పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్ రెడ్డి వీటిని సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నారు. ఆయన గురువారం మేయర్ అముదతో కలిసి నగరంలోని 1, 39, 50వ డివిజన్లో శుద్ధినీటి ప్లాంటు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. త్వరలోనే వీటిని అందుబాటులోకి తెస్తామన్నారు.

అదునుకు ముందుగానే విత్తనాలు

- పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు 10,380 క్వింటాళ్లు
- రేపటినుంచి ఆర్‌బీకేలలో రైతులకు విత్తనాల పంపిణీ
- ఏర్పాట్లను చేసిన వ్యవసాయశాఖ అధికారులు
- వేరుశనగ దుక్కులకు సన్నద్ధమవుతున్న రైతులు



రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ వేరుశనగ విత్తకాయలు

పలమనేరు: జిల్లాలో ఎక్కువగా వేరుశనగ సాగు చేసే ప్రాంతం పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్. ఇక్కడ మెట్టభూములు ఎక్కువగా ఉన్నాయి. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయడం పరిపాటి. సకాలంలో వర్షాలు పడితే జూన్ మొదటి వారం నుంచి విత్తనాలు వేసే అదును మొదలవుతుంది. ఈ పర్యాయం ప్రభుత్వం ముందుచూపుతో అదునుకు ముందుగానే సబ్సిడీ వేరుశనగ విత్తనాలను గోడౌన్లకు చేర్చింది. ఇప్పటికే వర్షాలు కురుస్తుండడంతో ఈసారి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే విత్తన కాయలను రైతులతో పాటు ఎమ్మెల్యే వెంకటేగౌడ పరిశీలించారు. నాణ్యతతో ఉన్నాయని చెప్పారు.

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో...

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఏడు మండలాలున్నాయి. ఇక్కడ వేరుశనగ సాధారణ సాగు 14,388 వేల హెక్టార్లు. ఇప్పటికే ఈ డివిజన్‌కు 10,380 క్వింటాళ్ల కే–6 రకం విత్తనాలు చేరాయి. ఈ నెలలో ఇప్పటికే 105 మిల్లీమీటర్ల వర్షపాతం ఇక్కడ నమోదవడంతో రైతులు ఆశాభావంతో ఉన్నారు. శనివారం నుంచి పలమనేరు నియోజకవర్గంలోని ఆర్‌బీకేల్లో విత్తనాల పంపిణీ చేయనున్నారు. పూర్తి స్థాయిలో స్టాకు అందాక కుప్పంలో ప్రారంభించనున్నట్టు స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి తెలిపారు.

రైతులకు సబ్సిడీ ఇలా...

కిలో వేరుశనగ విత్తనకాయల బస్తా(30 కిలోలు) ధర రూ.2790గా ఉంది. ప్రభుత్వ సబ్సిడీ రూ.1116 పోను రైతు రూ.1674 చెల్లించాల్సి ఉంటుంది.

పటిష్టంగా విత్తనాల పంపిణీ

గతంలోలా మండల కేంద్రాల్లో బారులు తీరిన రైతులు, వారిని అదుపు చేసేందుకు పోలీసుల బందోబస్తు లాంటి దృశ్యాలు ఇప్పుడు లేవు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పాస్‌పుస్తకం, మొబైల్ ఓటీపీ ద్వారా క్రాప్ బుకింగ్‌ను పరిశీలించి విత్తనాలను ఇవ్వనున్నారు. రైతు పొలం విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు ఓ బస్తా ఆపై ఉంటే రెండు బస్తాలను ఇస్తారు.

సబ్సిడీ విత్తనాల వైపే రైతన్నల మొగ్గు

కదిరి–6 విత్తనకాయలను సరఫరా చేస్తుండడంతో చాలా మంది రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో రైతులు సొంతంగా విత్తనాలను సిద్ధం చేసుకుని సాగుకు పూనుకునేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాణ్యమైన విత్తనకాయలను ఇస్తుండడంతో రైతులకు గత ప్రభుత్వ పాలనలోలా ఇబ్బందులు పడే దుస్థితి తప్పింది.

విత్తనాలు తీసుకుంటే సాగు చేయాల్సిందే



సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం, నూనె కోసం గానుగ ఆడించడం లాంటివి చేయరాదు. విత్తనాలను పొందిన రైతులు విధిగా వారి చేలల్లో వేయాలి. విత్తనాల పంపిణీ పటిష్టంగా చేయాలని ఇప్పటికే ఏవోలందరికీ ఆదేశాలిచ్చాం.
– అన్నపూర్ణదేవి, ఏడీ, పలమనేరు

సమయానికి విత్తనాలు



ఈసారి మే నెలలోనే వేరుశనగ విత్తనాలను ఇస్తున్నారు. దీంతో వాటిని ఒలిచి సిద్ధం చేసుకోవచ్చు. ఇప్పటికే వాన పడడంతో దుక్కులకు ఇబ్బంది లేదు. జూన్ తొలి వారంలో అదునులో వేసే పంట దిగుబడి వచ్చినట్టు ఆలస్యంగా వేస్తే రాదు. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం.
– విజయ్‌నాయుడు, రైతు, ముసలిమొడుగు

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి ఒక్కరూ టోల్ ఫ్రీ నంబర్ 1902 మీద అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం 26, 27వ తేదీలలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్రమణ్యం

రామకుప్పం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, జగనన్న లేఅవుట్‌లో అర్హులకు ఇంటి పట్టాలను సత్వరమే పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రామకుప్పంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అటవీ గ్రామాల అభివృద్ధికి మరింత నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు కోరారు. అర్హులకు హౌసింగ్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను లబ్ధిదారుల ఖాతాలకు చేరేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని సంబంధిత శాఖల అధికారులు సభ్యులకు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, తహసీల్దార్ మురళి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, చంద్రారెడ్డి, సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా పాల్గొన్నారు.

నేటి నుంచి వేరుశనగ కాయల పంపిణీ



సోమల : విత్తనాలను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: వేరుశన విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్‌ను చేసి టోకెన్లు జారీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారిణి జ్యోతమ్మ గురువారం తెలిపారు. విత్తన కాయలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబరును తీసుకురావాలన్నారు. ఈ నెల 26న శుక్రవారం లద్దిగం, దిగువపల్లె, కొండామర్రి, ఆమినిగుంట, ఏ.కొత్తకోట, కాగతి, వెంగళపల్లె, చింతమాకులపల్లె రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రకియ ఉంటుందని చెప్పారు. ఈనెల 27న గడ్డంవారిపల్లె, పరికిదొన, చారాల, దుర్గసముద్రం, చౌడేపల్లె, కాటిపేరిలో రిజిస్ట్రేషన్‌లు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుగానే బస్తాకు రూ.1,674 చెల్లించి రశీదు పొందాలన్నారు. రశీదు ఉన్న రైతులకు మాత్రమే విత్తన కాయలు పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

నేడు సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో శుక్రవారం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభిచనున్నట్టు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని 11 ఆర్బీకేలకు మొత్తం 1,330 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని ఆయన చెప్పారు. ఇందులో కదిరి–6 రకం 1,018 క్వింటాళ్లు, నారాయణి 312 క్వింటాళ్లు ఉన్నాయన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో విత్తనకాయల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

29 నుంచి..

శాంతిపురం: రైతులకు అవసరమైన విత్తనపు వేరుశనగ కాయలను ఈ నెల 29 నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. మండలంలోని మొత్తం 20 రైతు భరోసా కేంద్రాలను రెండు క్లస్టర్లుగా విభజించి మొదటి క్లస్టర్‌లో ఈ నెల 29 నుంచి, రెండో క్లస్టర్‌లో 31 నుంచి పంపిణీ చేస్తామన్నారు. మొదటి విడతలో సొన్నేగానిపల్లె, దండికుప్పం, కొలమడుగు, మఠం, ఎం.కె.పురం, రాళ్లబూదుగూరు, శివరామపురం, రెండో విడతలో కడపల్లె, కెనమాకులపల్లె 1, 2, కర్లగట్ట, మొరసనపల్లె, 121 పెద్దూరు, అనికెర, చెంగుబళ్ల, 64 పెద్దూరు, సి.బండపల్లె, అబకలదొడ్డి, గుంజార్లపల్లె, చిన్నారిదొడ్డిలో విత్తనాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. 30 కిలోల వేరుశనగ బస్తా రూ.2,790 కాగా ప్రభుత్వం రూ 1,116లను రాయితీగా ఇస్తోందన్నారు. రైతుల వాటాగా రూ 1,674 చెల్లించి విత్తనాలను పొందాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు చెందిన అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

27న వాహనాల వేలం

పుంగనూరు: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 27న పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10గంటకు వేలం వేయనున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక బొలేరో జీపును వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

27న ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెన్నైకు చెందిన శంకర్‌నేత్రాలయ వారిచే వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి జబ్బులు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కందూరు పాఠశాలలో సమ్మర్ క్యాంప్

సోమల: మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష, జిల్లా సైన్స్ మ్యూజియం, అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. 50 మంది విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని ప్రయోగాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ, హేమలత, చంద్రయ్య, సహదేవయ్య పాల్గొన్నారు.

బంగారుపాళెంలో భారీ వర్షం



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

బంగారుపాళెం: మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ఎక్కువైంది. ఉన్నఫళంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు చిరు జల్లులతో మొదలై భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో మురుగునీటి కాలువలు పొంగి జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో జలమయమైంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మొగిలి వెంకటగిరి వద్ద నూర్పిడి చేసి ఎండబెట్టిన వరి వర్షపునీటిలో కొట్టుకుపోయిందని బందార్లపల్లెకు చెందిన రైతు వెంకటాద్రి కన్నీటిపర్యంతమయ్యాడు. వర్షానికి తోడు గాలులు వీచడంతో మామిడి తోటల్లో కాయలు నేలరాలిపోయాయని రైతులు వాపోయారు. ఉక్కపోతతో అల్లాడిన జనానికి భారీ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది.

హామీలను నెరవేర్చడంలో ముందుంటాం



సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలలో అభివృద్ధి పనులు చేశారు. గురువారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. మొదట జామా మసీదు వీధిలో రూ.3.25 లక్షలతో, ఈశ్వర్‌నగర్‌లో రూ.9.20 లక్షలతో, కన్యకాపరమేశ్వరీ రోడ్డులో రూ.2.35 లక్షలు, బ్రాహ్మణ వీధిలో రూ.3.70 లక్షలతో వేసిన సీసీ రోడ్లను, కె.కొత్తూరులో రూ 5.85 లక్షలతో, గాండ్లపల్లెలో రూ7.85 లక్షలతో, ఇటుక రాళ్లపల్లెలో రూ6.30 లక్షలతో వేసిన సీసీ రోడ్లను, దుర్గానగర్‌లో రూ 7.40 లక్షలతో వేసిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, గతంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా మోకాలి లోతు గుంతల రోడ్లతో అడుగు తీసి అడుగు పెట్టలేని దుస్థితి ఉండేదన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సదుపాయాలు మెరుగు పరిచేందుకు, రోడ్ల నిర్మాణానికి అధిక మొత్తం నిధులు వెచ్చించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సీఎం చొరవతోనే రహదారులకు మహర్దశ ప్రాప్తించిందన్నారు. మరలా జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల విజ్ఞప్తి మేరకు సుమారు రూ.6లక్షలతో ఈ లైట్‌ను ఏర్పాటు చేయించామన్నారు. మండలానికి చెందిన డీజేఏసీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఉపసర్పంచ్ అక్మల్, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఈఓ యాదవపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల ఫలాలు

- ప్రాజెక్టులను అడ్డుకుంటే జనం సహిస్తారా?
- చంద్రబాబు నీచ రాజకీయాలు ప్రజలకు తెలుసు
- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



కుక్కల సమస్యను ఎమ్మెల్యే వెంకటేగౌడకు నివేదిస్తున్న పీపీఎస్ సభ్యులు

పలమనేరు: పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల ఫలాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పునరుద్ఘాటించారు. గురువారం స్థానిక ఎద్దులసంత సచివాలయ పరిధిలో 24, 25 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల్లో లబ్ధిదారులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేసేందుకు ప్రభుత్వం పుంగనూరు నియోజకవర్గంలో మూడు ప్రాజెక్టులను నిర్మిస్తోందన్నారు. అవి పూర్తయితే తెలుగుదేశం పార్టీ పుంగనూరులో నామరూపాల్లేకుండా పోతుందని భావించిన చంద్రబాబు కోర్టులకెళ్లి స్టేలు తేవడం ఎంతవరకు సమంజసమని సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు కుట్రలను జనం గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పడం తథ్యమన్నారు.

కుక్కల సమస్య తీర్చాలయ్యా!

పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు తదితరులు పట్టణంలో రోడ్ల సమస్య తీరిందనిఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే కుక్కల బెడద ఎక్కువగా ఉందని, దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్లు చాన్మాకమాల్, కిరణ్, జేసీఎస్ కన్వీనర్ కోదండరామయ్య, కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, పూర్ణిమ హేమంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో పరిచయం మంచిది కాదు

- ఏటా పెరుగుతున్న మైనర్ బాలికల మిస్సింగ్ కేసులు
- పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



మైనర్ బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు: అపరిచితులతో పరిచయం పెట్టుకోరాదని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు మైనర్ బాలికలకు హితవు పలికారు. అంతర్జాతీయ చిల్డ్రన్స్ మిస్సింగ్‌డే సందర్భంగా గురువారం స్థానిక కోర్టులో ఆయన పట్టణంలోని టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మైనర్ పిల్లల మనస్తత్వం చాలా గందరగోళంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో వారిని మాయమాటలతో లోబరచుకునేందుకు కొందరు యత్నిస్తుంటారని, అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ పరిచయాలు ప్రమాదాలకు దారి తీసే అవకాశాలను కొట్టిపారేయలేమని, కాబట్టి తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. ఏటా నమోదవుతున్న మిస్సింగ్ కేసుల్లో ఎక్కువగా మైనర్ బాలికలవే ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తుల నుంచి ఏదేని ప్రమాదం ఉందని గ్రహిస్తే యాప్ సాయంతో ఎలా బైటపడాలో అవగాహన కల్పించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



చౌడేపల్లెలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటకు చెందిన విజయకుమారికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.3 లక్షల చెక్కును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి గురువారం అందజేశారు. మోకాలి శస్త్రచికిత్స చేసుకున్న ఆమె తన ఆర్థిక ఇబ్బందులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ఆమెకు ఆర్థిక చేయూతనిచ్చారు. జగనన్న ప్రభుత్వానికి, మంత్రికి రుణపడి ఉంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, మండల సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, ఉపసర్పంచ్ వినోద్ కుమార్ రెడ్డి, నేతలు షఫీ, చిన్నా, వెంకటరమణ, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మండలంలోని పెద్దకొండామర్రిలో సంపును శుభ్రం చేసేందుకు వెళ్లి మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు రూ.90 వేలు నగదును గురువారం పంపిణీ చేశారు. ఈ సంఘటనలో మృతి చెందిన బంగిరవి, తలారి వెంకటరమణ, గుర్రంకొండ మునిరాజ కుటుంబాలకు సర్పంచ్ జయసుధమ్మ, నాగభూషణరెడ్డి చొరవ చూపి, ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని తురక పేటకు చెందిన ఖాదర్‌వలీకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.20వేల చెక్‌ను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అందజేసారు. ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

బంగారుపాళెం: స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వరదరాజన్ అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లెలో గురువారం సాయంత్రం బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రుణాలపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు, రైతులకు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎం వాణికిషోర్ కుమార్‌రెడ్డి, బంగారుపాళెం స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రామారావు మాట్లాడారు. బ్యాంకు ఇచ్చే రుణాలను వివరించారు. స్థానిక సర్పంచ్ గౌరమ్మ, అగ్రి బిజినెస్ యూనిట్ డీజీఎం హేమ, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.